క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ సత్యనారాయణ, అనున్న వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం వెంటనే అమలు చేయాలని, వెంటనే 12 పీఆర్సీని ప్రకటించి ఐఆర్‌ను ఉద్యోగుల మనోభీష్టానికి అనుకూలంగా ఇవ్వవలసిందిగా కోరారు. బదిలీ అయినా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో నూతన డీఎస్సీ వారిని నియమించాలని, దసరా పండుగ సందర్భంగా బకాయిలు పడిన నాలుగు డీఏలను, వెంటనే ప్రకటించాలని సూచించారు. పీఎఫ్, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ సరెండర్ లీవ్ బకాయిలకు వెంటనే నిధులు మంజూరు చేయవలసిందిగా కోరారు. మెడికల్ లీవ్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించేందుకు ఉత్తర్వులు మంజూరు చేయాలని కోరారు.

కాత్యాయనీదేవి సేవలో మాజీ స్పీకర్ తమ్మినేని



వించిపేట(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దసరా మహోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న జగన్మాత శ్రీ కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యంతో ఉండేలా అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో అధికారుల శ్రమదానం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా సారథ్యంలో విజయవాడ డివిజన్ వ్యాప్తంగా శ్రమదానం చేశారు. అందులో భాగంగా విజయవాడ రైల్వేస్టేషన్, కార్యాలయాలు, డిపోలు, రైల్వే కాలనీల్లో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు డివిజన్ వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు డివిజన్‌లో చేస్తున్న పరిశుభ్రత డ్రైవ్‌లు భవిష్యత్తులో స్వచ్ఛభారత్ మిషన్ ఆదర్శాలను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ ప్రచారంలో డివిజన్ ఉద్యోగులు నిబద్ధతతో భాగస్వాములు కావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.



జయ జయహే జననీ

దిగువున కృష్ణమ్మ పరవళ్లు.. ఎగువున దుర్గమ్మ దీవెనలు.. కొండంతా సంబరం.. భక్తుల ఆనంద పరవశం.. వెరసి బెజవాడ ఆధ్యాత్మిక సుగంధాలను వెదజల్లుతోంది. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో దుర్గమ్మ దర్శనానికి అశేష జనవాహిని కదిలివస్తూనే ఉంది. కుంకుమ పూజల వైభోగం, సాంస్కృతిక కార్యక్రమాల వైభవంతో గురువారం ఇంద్రకీలాద్రి సింధూరశోభితమై మెరిసింది. భక్తుల కల్పవల్లిగా.. శ్రీకాత్యాయనీ దేవిగా కొలువుదీరిన దుర్గమ్మను కనులారా వీక్షించిన అశేష భక్తవాహిని అమ్మకు నీరాజనాలు అర్పించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సేవ చేయం.. పెత్తనమే చేస్తాం!

- దసరా జంబో ఉత్సవ కమిటీ సభ్యుల తీరు ఇది
- అధికారులతో నిత్యం వాగ్వాదం
- తమతో పాటు తమవారికి ప్రత్యేక దర్శనాలు కావాలంటూ హడావుడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'పార్టీకి అంత ఖర్చు పెట్టి వస్తే ఇక్కడ సేవలందించాలా? ఎంతో కష్టపడి ఎమ్మెల్యేలను గెలిపించుకున్నాం.. మా వాళ్లకు దర్శనాలు చేయించాలంటే.. అడ్డుకుంటున్నారు.. ఇంకెందుకు ఈ కమిటీ, మాకు ఇంకేమి పనులు లేవా?' ఇవి దసరా సేవా (ఉత్సవ) కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అధికారులపై మండిపడుతూ అంటున్న మాటలు. దసరా సేవా కమిటీ పేరుతో ఆలయ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 96 మందితో కూటమి ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించింది. వారిలో చాలా మంది ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న అధికార యంత్రాంగంతో పదేపదే వివాదాలకు దిగుతున్నారు. దాంతో ఆలయ ప్రాంగణంలో పలు ప్రాంతాల్లో ఘర్షణపూర్వక వాతావరణం కనిపిస్తోంది

ఎంతో కష్టపడి ఎమ్మెల్యేలను గెలిపించుకున్నాం..

తామెంతో కష్టపడి ఎమ్మెల్యేలను గెలిపించుకున్నామని, తమ పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నామని.. అయినా కనీసం మావాళ్లను దర్శనానికి తీసుకొని వెళ్లకపోతే ఇంకెందుకు ఈ కమిటీ అంటూ వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ తమ వర్గీయులను దర్శనానికి తీసుకెళ్తున్న సమయాల్లో అధికారులు వారిని అడ్డుకుంటున్నారు. మీరు మాత్రమే లోపలకు వెళ్లండంటూ సూచిస్తున్నారు. దీంతో వివాదాలు మొదలవుతున్నాయి. ఇది సాధారణ భక్తులకు అసౌకర్యానికి కారణమవుతోంది.



పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే కూర్చున్న కమిటీ సభ్యురాలు

సేవలందించాలంటున్న అధికారులు..

ఉత్సవ కమిటీ సభ్యులను వివిధ ప్రాంతాల్లో సేవలందించేందుకు ముందుకు రావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా కొంతమంది అన్నదానం, ప్రోటోకాల్, పూజలు వంటి ప్రాంతాల్లో ఆలయ సేవలు విజయవంతంగా జరిగేందుకు సహకరించాలని అక్కడ కార్యక్రమాలను సమన్వయం చేయాలని ఈవో శీనానాయక్ తొలి రోజు కమిటీ సభ్యులకు సూచించారు. అయితే వారంతా 'మా మాట ఎవరింటారండి? అయినా మాకు పనేమి లేదనుకుంటున్నారా?' అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. వారి వరకూ దర్శనానికి అనుమతిస్తామంటూ పోలీసులు సైతం చెబుతున్నారు. ఉత్సవ కమిటీ పేరుతో దసరా ఉత్సవాల్లో అజమాయిషి చెలాయించేందుకు వారంతా ప్రయత్నిస్తున్నారంటూ అధికారులు తిరిగి సమాధానమిస్తున్నారు.

పోలీసులకు ఎందుకు స్పెషల్..

పోలీసు శాఖ వారు వారి తాలుకా వస్తే ఎటువంటి కార్డులు లేకపోయినా వదిలేస్తున్నారని తమ వారిని మాత్రం పంపటం లేదని కమిటీ సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కూటమి పార్టీకి చెందిన ఒక మహిళా నేత గేట్ వద్దనే కూర్చొని మీ వాళ్లను పంపించండి చూస్తా.. అంటూ వాదానికి దిగటం కొద్దిసేపు స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది.

అంతా ప్రచార ఆర్భాటమే!

వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని దుర్గగుడి అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నారని, అయితే సామాన్య భక్తులకు వారు చెబుతున్నంతగా సౌకర్యాలు లేవని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన వెంకట మహేష్ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం కాత్యాయనీదేవిగా అమ్మవారిని పోతిన వెంకట మహేష్ పలువురు పార్టీ నేతలు దర్శించుకున్నారు. కెనాల్‌రోడ్డు నుంచి సర్వ దర్శనం క్యూలైన్‌లో కొండపైకి చేరుకున్న పోతిన మహేష్ మార్గమధ్యలో భక్తులతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడారు. కెనాల్‌రోడ్డు నుంచి అమ్మవారి ఆలయానికి రెండుపావు గంటల సమయం పట్టిందన్నారు. ప్రచారం కల్పించినంత గా సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. క్యూలైన్‌లో ఒకటి, రెండు చోట్ల మాత్రమే మంచినీళ్లు,పాలు ఇస్తున్నారన్నారు.



క్యూలైన్లో భక్తులతో పోతిన మహేష్

అధికంగా ప్లాస్టిక్ వినియోగం..

కొండపై ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని, క్యూలైన్‌లో కుక్కలు నిద్రపోతున్నాయని మహేష్ అన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి అభివృద్ధికి రూ. 70 కోట్లు కేటాయించారని, ఇప్పుడు ఎంపీ కేశినేని చిన్ని కూడా రూ. 120 కోట్లు తెస్తామని చెప్పారన్నారు. ఆ నిధులు తీసుకురావాలన్నారు. కాశీకి వారణాసి ఎక్స్‌ప్రెస్, షిర్డీకి షిర్డీ ఎక్స్‌ప్రెస్, తిరుపతికి తిరుమల ఎక్స్‌ప్రెస్ తరహాలో విజయవాడ నుంచి బయలుదేరే ట్రైన్‌కు ఇంద్రకీలాద్రి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఊపిరితిత్తుల ఆరోగ్యం కీలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ శరీరంలో ఊపిరితిత్తులు ముఖ్యపాత్ర పోషిస్తాయని, వాటిని ఆరోగ్యంగా ఉంచుకుంటే జీవితంలో ఎలాంటి శ్వాసకోశ వ్యాధులు దరిచేరవని జిల్లా క్షయ నియంత్రణ సమన్వయకర్త సీహెచ్ దినేష్ అన్నారు. ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం దినోత్సవం సందర్భంగా వాసవ్య మహిళా మండలి, అపోలో టైర్స్ హెల్త్ కేర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో భవానీపురం ఐరన్‌యార్డ్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదిస్తే పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. మెడికల్ అధికారి డాక్టర్ ఆర్ స్వర్ణలత మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి నేటి వరకు నగరంలో పలు ప్రాంతాలలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ లక్షణాలున్న 29 మందికి పరీక్షలు చేయగా వారిలో ఒకరికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని, వారిని డాట్స్ చికిత్సకు అనుసంధానం చేశామని వివరించారు. వాసవ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఐపీ దర్శనాల కోసం తోపులాట



ఈవో చాంబర్ గేటు వద్ద భక్త బృందం



వీవీఐపీ గేటు వద్ద సెక్యూరిటీని తోసుకొని వస్తున్న భక్తులు

వించిపేట,ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీఐపీ టైం స్లాట్ మార్పు, ఎవరికి వారే వీఐపీ దర్శనాలు చేసుకోవాలనే ఆతృత తోపులాటకు దారి తీసింది. సిఫార్సులు, వీఐపీ టికెట్లతో అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తుల ఇంద్రకీలాద్రికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణంలో గురువారం గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే గురువారం నుంచి వీఐపీ టైం స్లాట్‌ను తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటలకు మార్పు చేసినట్లు బుధవారం రాత్రి ఆలయ అధికారులు ప్రకటించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్య వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు యథావిధిగా వీఐపీ దర్శనాలకై కొండపైకి తరలివచ్చారు. అయితే బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని గాలిగోపురం వద్ద క్యూలైన్‌లోకి వీఐపీలను అనుమతించే గేట్‌కు ఇంజినీరింగ్ సిబ్బంది వెల్డింగ్ చేసేశారు. దీంతో అక్కడకు వచ్చిన వారు తమకు వీవీఐపీ, ఈవో చాబర్ గేట్ నుంచైనా లోపలకు అనుమతించాలంటూ బారులు తీశారు. అర్చకుల కోసం గేట్ తాళాలు తీసిన సెక్యూరిటీ సిబ్బందిని తోసుకుంటూ భక్తులు లోపలకు వెళ్లడంతో పరిస్థితి గందరగోళంగా మారిపోయింది. ఇక చేసేది లేక దేవాదాయశాఖ, పోలీసులు అధికారులు వీవీఐపీ, ఈవో చాంబర్ వైపు ఉన్న గేట్లను తెరిచారు. చివరకు గాలిగోపురం వద్ద క్యూలైన్ గేట్‌కు చేసిన వెల్డింగ్‌కు హుటాహుటిన సిబ్బంది తొలగించడంతో ఆ మార్గం ద్వారా భక్తులు వీఐపీ క్యూలైన్‌లోకి చేరుకున్నారు.

వాటర్ బాటిళ్లలోనూ వివక్షేనా?



వాటర్ బాటిళ్లను మోసుకెళ్తున్న వీఎంసీ సిబ్బంది



భక్తులకు లోకల్ బ్రాండ్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేస్తున్న వీఎంసీ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు సరఫరా చేసేందుకు తీసుకువచ్చిన పెద్ద బ్రాండ్ వాటర్ బాటిళ్లు గుట్టు చప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. దసరా ఉత్సవాలలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు పంపిణీ కోసం మంచి నీటి వాటర్ బాటిళ్లను ఆలయంలోని వివిధ పాయింట్లకు తరలించారు. అయితే భక్తుల కోసం కొనుగోలు చేసిన వాటర్ బాటిళ్లలో కొన్ని ప్రముఖ కంపెనీ వాటర్ బాటిల్స్ కాగా మరికొన్ని లోకల్ కంపెనీలకు చెందినవి ఉన్నాయి. గురువారం ఆలయ ప్రాంగణంలోని గోశాల వద్దకు రెండు కంపెనీలకు చెందిన వాటర్ బాటిల్స్‌ను దిగుమతి చేసుకున్నారు. అయితే వాటిలో ప్రముఖ కంపెనికి చెందిన బాటిల్ ప్యాకెట్లను ఆలయ ముఖ్య అధికారి చాంబర్‌కు గుట్టు చప్పుడు కాకుండా తరలించారు. వందల సంఖ్యలో వాటర్ బాటిళ్లను వీఎంసీ సిబ్బంది చేత మోయించడం చర్చనీయాంశంగా మారింది.

కరాటే పోటీల్లో పీఎస్ సీఎంఆర్ విద్యార్థి ప్రతిభ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి కరాటేలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ తెలిపారు. కళాశాలకు చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె. మోహన్ సాయి విశాఖపట్నంలో జరిగిన ఐదో సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్‌షిప్ అండర్–19 గ్రూప్ కేటగిరీలో వ్యక్తిగత కటా, వ్యక్తిగత కుమిటే రెండు క్యాటగిరీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ మోహన్‌సాయిని అభినందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ జాన్సన్‌ను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ తదితరులు

28న శతాధిక వృద్ధులకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28వ తేదీన విజయవాడ దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 13 మంది శతాధిక వృద్ధులను తాము ఇప్పటికే గుర్తించామన్నారు. వారికి ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రముఖుల చేతులమీదుగా సత్కారం నిర్వహించి, నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అదేరోజు వయోవృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు. ఇంకా ఎక్కడైనా శతాధిక వృద్ధులు ఉంటే వారి వివరాలు తమకు తెలియజేస్తే తాము వారిని సొంత ఖర్చులతో తీసుకువచ్చి సత్కారం చేసి తిరిగి వారి ఇంటి వద్ద దింపనున్నట్లు తెలిపారు. ఇందుకుగానూ 93475 72766 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జున రావు, ఎన్‌వీయూ సతీష్‌కుమార్, పి. లక్ష్మీనరసింహ రావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీలు

ఊరొదిలి వెళ్లిపోతాం!

పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆవేదన


భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలు మొదలయ్యాయంటే అమ్మవారి దర్శనం కోసం ఒత్తిళ్లు పెరుగుతాయి. ముఖ్యంగా అధికార పార్టీలో ఉన్న పెద్ద నాయకుల నుంచి చోటామోటా నాయకుల వెంట ఉచిత పాస్‌ల కోసం ఎగబడుతుంటారు. వాటి కోసం స్థానిక కూటమి నాయకులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లటం, అక్కడ ఉండే వ్యక్తి కార్యాలయ కార్యదర్శి చెబితేనే తాను ఏర్పాటు చేయగలనని చెప్పటం జరుగుతుంది. అయితే ఆ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు రెండు కార్లు, ఇప్పుడు నాలుగు కార్లు పెట్టి హైదరాబాద్, చెన్నై వంటి ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారిని మాత్రం ఇంద్రకీలాద్రిపైకి పంపించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరిపై మండిపడుతున్నారు. లోకల్‌లో పాస్‌లు అడుగుతున్న ప్రజలకు సమాధానం చెప్పలేక ఇళ్లల్లో కూర్చోవల్సిన దుస్థితిలో ఉన్నామని భవానీపురంలోని టీడీపీ మాజీ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్న ఎలక్షన్స్‌లో దగ్గరుండి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయించి గెలిపించిన తాము ఇప్పుడు వారు అడుగుతుంటే తల ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కావడం లేదని తలలు పట్టుకుంటున్నారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఊరు వదిలి వెళ్లిపోదామనిపిస్తుందని లోకల్ టీడీపీ నాయకులు వాపోతున్నారు.



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో..



శ్రీఅన్నపూర్ణా దేవి అలంకారంలో పోలేరమ్మ



అన్నపూర్ణాదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



కాత్యాయనీదేవిగా గంగానమ్మ అమ్మవారు



శ్రీ ధనలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న పద్మావతీదేవి



అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ అమ్మవారు

కాత్యాయనీ.. కటాక్షించు మాతా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలకు పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ నగరాల మహాలక్ష్మీ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ వన్‌టౌన్ బ్రాంచ్ మేనేజర్ అడపా సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కళావేదికపై పలువురు చిన్నారులు కూచిపూడి, భరతనాట్యాలను ప్రదర్శించారు.

- పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉభయదాతలచే అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ హోమం జరిపించారు
- శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశేష కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

భవానీపురం పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో, చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లోగల శ్రీ గంగా – దుర్గా – మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీకాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. భవానీపురం ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో పోలేరమ్మ అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వన్ సెంటర్‌లో కాశీ విశాలక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో, భగవాన్ వెంకయ్య స్వామి దేవస్థానంలో, రాయనపాడు గ్రామంలోని శ్రీవసంత వేణుగోపాల స్వామి దేవస్థానం, భవానీపురం శ్రీపంచాయతన శక్తి క్షేత్రం కనకదుర్గమ్మ ఆలయంలో జగన్మాత శ్రీకాత్యాయనీ దేవిగా దర్శనం ఇచ్చారు.

ధనలక్ష్మి, అన్నపూర్ణ అలంకారాల్లోనూ..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక బ్రాహ్మణవీధిలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని పద్మావతిదేవి అమ్మవారు గురువారం శ్రీ ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ప్రాంగణంలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు కుంకుమార్చనలను నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం సంకీర్తనాగానం కార్యక్రమాన్ని నిర్వహించారు.
- బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదును మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- కేటీరోడ్డులో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు.
- కొత్తపేట సైకం వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్పేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాలార్చన తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.
- కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఉన్న దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. హిందూహైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

● నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ధీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం 26వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని విగ్రహ కమిటీ చైర్మన్ కందకట్ల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విగ్రహావిష్కరణ పోస్టర్‌ను విడుదల చేశారు. రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.